


పరేడ్ మైదానంలో అంతర్జాతీయ కైట్ అండ్ స్వీట్ ఫెస్టివల్ సోమవారం ఘనంగా ప్రారంభమైంది. ఈ సందర్భంగా వివిధ ఆకృతుల పతంగులు, విభిన్న రకాల స్వీట్లు ఆకట్టుకున్నాయి.


నమస్తే తెలంగాణ

# హైదరాబాద్

హైదరాబాద్- మేడ్చల్

I | హైదరాబాద్, మంగళవారం 14 జనవరి 2025 | HYDERABAD




మాదాపూర్ శిల్పారామంలో గంగిరెద్దు విన్యాసం



ఎల్బీ నగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి నివాసంలో జరిగిన భోగి వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యేలు కేటీఆర్, హరీశ్‌రావు, కౌశిక్‌రెడ్డి, సబితాఇంద్రారెడ్డి, మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు



బంజారాహిల్స్‌లోని కేబీఆర్ పార్కులో జరిగిన భోగి వేడుకల్లో చిన్నారులను ఆశీర్వదిస్తున్న ఎమ్మెల్సీ కవిత

# సంక్రాంతి సంబురాలు

## ఆకట్టుకున్న పతంగులు..నోరూరించిన స్వీట్లు

సంక్రాంతి వేడుకల్లో భాగంగా సోమవారం నగరవ్యాప్తంగా భోగి పండగను ఘనంగా జరుపుకొన్నారు. పిల్లలు, పెద్దలు, ఉదయాన్నే వీధుల్లో భోగి మంటలు వేశారు. మహిళలు తమ ఇండ్ల ముందు అందమైన రంగవల్లులను తీర్చిదిద్దారు. మరోవైపు భక్తులు ఆలయాలకు వెళ్లి..ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఎల్బీ నగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి నివాసంలో జరిగిన భోగి వేడుకల్లో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హాజరవ్వగా, బంజారాహిల్స్‌లోని కేబీఆర్ పార్కులో జరిగిన వేడుకల్లో ఎమ్మెల్సీ కవిత పాల్గొన్నారు. మరోవైపు సికింద్రాబాద్ పరేడ్ మైదానంలో కైట్ అండ్ స్వీట్ ఫెస్టివల్ వైభవంగా ప్రారంభమైంది. తొలిరోజు విభిన్న ఆకృతులతో కూడిన రంగురంగుల భారీ పతంగులు ఆకట్టుకుంటే..పసందైన స్వీట్లు నోరూరించాయి.



### చైనా మాంజా విక్రయదారులపై 107 కేసులు

సిటీబ్యూరో, జనవరి 13 (నమస్తే తెలంగాణ): నిషేధిత చైనా మాంజాలపై నగర టాస్క్‌ఫోర్స్ విభాగం, స్థానిక పోలీసులతో కలిసి నాలుగు నెలల్లో 107 కేసులు నమోదు చేసిందని టాస్క్‌ఫోర్స్ డీసీపీ సుదీంద్ర తెలిపారు. ఈ మేరకు సోమవారం టాస్క్‌ఫోర్స్ అదనపు డీసీపీ శ్రీనివాస్‌రావు విలేకరుల సమావేశంలో ఈ వివరాలు వెల్లడించారు. సింథటిక్ నైలాన్, గ్లాస్ కోటింగ్‌తో తయారు చేసిన పతంగుల దారాలతో మనుషులతో పాటు జంతువులు, పక్షుల ప్రాణాలకు హాని జరుగుతుందని, ఈ నేపథ్యంలో చైనా మాంజాలపై నిషేధం ఉందన్నారు. అయినా కూడా కొందరు వ్యాపారులు చైనా మాంజాలను తెచ్చి విక్రయిస్తున్నారని తెలిపారు. ఈ క్రమంలోనే గత అక్టోబర్ నెల నుంచి జనవరి 13వ తేదీ వరకు నగరంలోని ఏడు జోన్లలో స్థానిక పోలీసులతో కలిసి 107 కేసులు నమోదు చేసి 148 మందిని అరెస్టు చేసినట్లు వివరించారు. వీరి వద్ద నుంచి రూ. 90 లక్షల విలువైన 7334 చైనా మాంజా బబ్బిన్స్‌ను స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు. చైనా మాంజాలను ఎవరూ వాడకూడదంటూ పోలీసులు సూచిస్తున్నారు.

# వేడుకలు.. ప్రయాణాలు

## వైరస్‌లు వ్యాప్తి చెందే అవకాశం

### సంక్రాంతి వేళ .. ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

### పండుగపూట జర భద్రమంటున్న వైద్యనిపుణులు

సిటీబ్యూరో: దేశంలో అక్కడక్కడ హెచ్‌ఎంపీవీ వైరస్‌కు సంబంధించిన కేసులు నమోదవుతున్న దృష్ట్యా ప్రజలు జాగ్రత్తగా ఉండాలని వైద్యులు సూచిస్తున్నారు. సంక్రాంతి పండుగను పురస్కరించుకుని చాలా మంది ప్రజలు నగరాల నుంచి వారి సొంత గ్రామాలకు పయనమవుతుంటారు. అంతే కాకుండా ఈ సీజన్‌లో పలు రకాల జాతరలు, వేడుకలు కూడా పెద్ద ఎత్తున జరుగుతుంటాయి. ఈ నేపథ్యంలో పెద్ద సంఖ్యలో జనం ఒక్కచోట గుమ్మిగూడటం వల్ల అంటువ్యాధులు వ్యాప్తి చెందే అవకాశాలు ఎక్కువ అని, సాధారణ జలుబు, దగ్గు వంటి ఫ్లూ సంబంధిత వైరస్‌లు కూడా ఒకరి నుంచి మరొకరికి సోకే అవకాశముంటుందని వైద్యులు చెబుతున్నారు. మరో వైపు దేశంలో హెచ్‌ఎంపీవీ అలజడి ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండి ముందు జాగ్రత్త చర్యలు పాటించడం శ్రేయస్కరమంటున్నారు వైద్యనిపుణులు.

### అప్రమత్తంగా ఉండాలి

ముఖ్యంగా చిన్నపిల్లలు, వృద్ధులు, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తుల విషయంలో అప్రమత్తంగా ఉండాలని హెచ్చరిస్తున్నారు వైద్యులు. వీరికి రోగనిరోధక శక్తి తక్కువగా ఉండటం వల్ల సాధారణ జలుబు చేసినా త్వరగా తగ్గకపోవడమే కాకుండా సకాలంలో సరైన చికిత్స అందించకపోతే అది ఇతర అనారోగ్యాలకు దారితీసే అవకాశాలుంటాయని చెబుతున్నారు వైద్యులు. చలికాలం కావడంతో సాధారణంగానే వైరస్‌ల ప్రభావం అధికంగా ఉంటుందని, వృద్ధులు, చిన్నపిల్లలు, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులపై అవి ఇతరుల కంటే మరింత తీవ్ర ప్రభావం చూపే అవకాశముందని, హెచ్‌ఎంపీవీ వంటి వైరస్‌లు ప్రమాదకరం కాకపోయినా వీరిపై ప్రభావం చూపే అవకాశాలు లేకపోలేదంటున్నారు నిపుణులు. జలుబు, దగ్గు, జ్వరం వంటి లక్షణాలు వచ్చిన వెంటనే నిర్లక్ష్యం చేయకుండా చికిత్స తీసుకోవాలని సూచిస్తున్నారు. దూర ప్రయాణాలు చేసినప్పుడు, జనావాసాల మధ్య వెళ్లినప్పుడు సాధ్యమైనంత వరకు మాస్కులు ధరించడం ఉత్తమమని, చేతులకు శానిటైజర్ వాడటం వంటి నియమాలు పాటించడం శ్రేయస్కరమని యాదాద్రి-భువనగిరి జిల్లా ప్రభుత్వ దవాఖాన సూపరింటెండెంట్ డాక్టర్ రాజారావు సూచించారు.

# సాగదీసి.. వ్యయం పెంచి!

### ఖజానాపై భారం మోపుతున్న ఇంజినీరింగ్ లోపాలు

### ఒక్కొక్కరికీ నాలుగు, ఐదేసీ బాధ్యతలు

### సరైన పర్యవేక్షణ లేక నిర్ణీత వ్యవధిలో పూర్తి కానీ ప్రాజెక్టులు

### స్పోర్ట్స్ కాంప్లెక్స్ పనుల నుంచి ఎస్ఆర్‌డీపీ వరకు తప్పని భారం

సిటీబ్యూరో : గ్రేటర్ పరిధిలో జీహెచ్‌ఎంసీ చేపడుతున్న ప్రాజెక్టు అంచనాలు తారుమారవుతున్నాయి. పనుల ప్రారంభానికి ముందున్న అంచనాలు..పూర్తయ్యే నాటికి ఉండటం లేదు. ప్రతి పనిలో 20 నుంచి 30 శాతం పెరుగుదల కనిపిస్తున్నది. ఇందులో భాగంగా తాజాగా నల్గొండ క్రాస్ రోడ్ నుంచి సైదాబాద్, ఐఎస్ సదన్ -ఓవైసీ జంక్షన్ కారిడార్ వరకు నిర్మితమవుతున్న స్టీల్ బ్రిడ్జి ప్రాజెక్టు వ్యయం పెంచుతూ ప్రభుత్వం తాజాగా ఉత్తర్వులు జారీ చేసింది. పన్నులు, గడిచిన కాలంలో ధరల పెరుగుదల దృష్ట్యా రూ. 523.37 కోట్ల ప్రాజెక్టు వ్యయాన్ని రూ. 620కోట్లకు పెంచేశారు. ఫలితంగా జీహెచ్‌ఎంసీ ఖజానాపై అదనంగా రూ. 96.63 కోట్ల భారం పడింది. అంతకు ముందు ఆర్టీసీ క్రాస్‌రోడ్ స్టీల్ బ్రిడ్జికి రూ. 139 కోట్ల అంచనా వ్యయం పెంచేశారు. ఇలా స్పోర్ట్స్ కాంప్లెక్స్‌ల నిర్మాణాల నుంచి ఎస్ఆర్‌డీపీ ఫ్లై ఓవర్ల వరకు అంచనాలు మారుతున్నాయి..ఇక్కడే నాణానికి మరో వైపు అన్నట్లుగా అసలు పనుల జాప్యానికి ఇంజినీరింగ్ వ్యవస్థ గాడి తప్పడమే. గ్రేటర్ పరిధిలోని ఆరు జోన్లలో నాలుగు జోనల్‌లకు చెందిన ప్రాజెక్టు సూపరింటెండెంట్ ఇంజనీర్ (ఎస్ఈ) బాధ్యతలు ఒక్కరికే కేటాయించడం, మరొకరికి ఐదు విభాగాల చీఫ్ ఇంజినీర్ (సీఈ-ప్రాజెక్ట్స్-మెయింటెనెన్స్, హౌసింగ్, లేక్, అడ్మిన్) బాధ్యతలు అప్పగించారు. ఇక్కడే పరిపాలనాధికారుల తీరుపై సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ముఖ్యంగా ఇంజినీరింగ్ వ్యవస్థలో నెలకొన్న లోపాలే ఖజానాపై భారం పడేలా చేస్తున్నాయన్న ఆరోపణలు లేకపోలేదు. కొందరు అధికారులు ఏజెన్సీల కొమ్ము కాస్తూ అంచనాలు పెంచేలా పరోక్ష సహకారం అందిస్తున్నారన్న వాదనలు లేకపోలేదు. ప్రాజెక్టు నిర్ణీత గడువులోగా పూర్తి చేసే సరైన పర్యవేక్షణ లేకపోవడమే ప్రాజెక్టులు భారంగా మారుతున్నాయని పాలకమండలి సభ్యులు చెబుతున్నారు.

### నిర్ణీత వ్యవధిలో..

హైదరాబాద్ నగరాన్ని విశ్వనగరంగా తీర్చిదిద్దాలన్న సంకల్పంలో భాగంగా గత కేసీఆర్ ప్రభుత్వం సిగ్నల్ రహిత ప్రయాణమే లక్ష్యంగా రూ.5937కోట్ల అంచనా వ్యయంతో జీహెచ్‌ఎంసీ 42 ప్రాజెక్టులకు శ్రీకారం చుట్టింది. 42 ఫ్లై ఓవర్లలో 37 చోట్ల పనులు వాయువేగంతో పూర్తి చేసి ట్రాఫిక్ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపింది. కానీ గడిచిన ఏడాది కాలంలో ఎస్ఆర్‌డీపీ పనుల పురోగతిలో వేగం మందగించింది. ఈ నేపథ్యంలోనే శాస్త్రీపురం ఆర్వోబీ (రూ.71 కోట్లు), ఫలక్‌నుమా ఆర్వోబీ రూ.47.10కోట్లు, శిల్పా లే అవుట్ ఫ్లై ఓవర్ స్టేజ్-2 రూ. 275కోట్లు, నల్గొండ క్రాస్‌రోడ్ స్టీల్ బ్రిడ్జి రూ. 370 కోట్లు ఉండగా ఇప్పుడు రూ.620కోట్లకు పెరగడం గమనార్హం. ఉప్పల్ జంక్షన్ ఫ్లై ఓవర్ రూ. 311 కోట్లతో చేపట్టగా, ప్రాజెక్టు పూర్తి అయ్యే నాటికి మరో 30శాతం మేర అదనంగా భారం ఖజానాపై పడే అవకాశాలు లేకపోలేదు. మొత్తంగా జీహెచ్‌ఎంసీ ఇంజినీరింగ్ విభాగంలో ఎవరికి వారే యమునా తీరే అన్న చందంగా మారడం, టెండర్ల పిలుపు నుంచి సంబంధిత ప్రాజెక్టు పనులను నిర్ణీత వ్యవధిలో పూర్తి చేయలేకపోతున్నారు.



# లోపించిన సమన్వయం

### కన్వర్జెన్సీ మీటింగ్‌లకు జీహెచ్‌ఎంసీ రాం..రాం..

### శాఖల మధ్య సమన్వయ లేమితో పౌరులకు ఇబ్బందులు

### నత్తనడకన అభివృద్ధి పనులు.. అటకెక్కిన భూసేకరణ

సిటీబ్యూరో: హైదరాబాద్ నగర సమగ్రాభివృద్ధికి, పౌరులకు సత్వర సేవలకు సంబంధించి కీలకమైన సమన్వయ సమావేశాలకు జీహెచ్‌ఎంసీ మంగళం పాడింది. అంతర్గతంగానూ, ఇతర ప్రభుత్వ శాఖలతో సమన్వయ లేమితో జీహెచ్‌ఎంసీ వైఖరి నగర పౌరులను తీవ్ర ఇబ్బందులు గురి చేస్తున్నది. ఫుట్‌పాత్, జంక్షన్ల అభివృద్ధి, ట్రాఫిక్ సమస్య మొదలు నాలా, రహదారుల వెడల్పు, భూసేకరణ, అనుమతుల్లో జాప్యం, విద్యుత్, జలమండలికి సంబంధించి ఏ పనులు చేయాలన్నా ఏదో ఓ సమస్య ఏర్పడుతున్నది. వాస్తవంగా గతంలో సిటీ సమన్వయ కమిటీ తరచూ సమావేశాలు నిర్వహిస్తూ, అభివృద్ధి పనులు సకాలంలో పూర్తయ్యేలా చర్యలు చేపట్టారు. జలమండలి, పోలీస్, విద్యుత్, పీసీబీ, ఆర్టీసీ, వైద్యారోగ్యశాఖ, కలెక్టరేట్, అగ్నిమాపక శాఖ, హెచ్‌ఎండీఏ, తదితర శాఖల అధికారులు సభ్యులుగా ఉండగా, జీహెచ్‌ఎంసీ పెద్దన్న పాత్రను పోషించేది. ఈ సిటీ సమన్వయ కమిటీతో నగరంలో ప్రస్తుతం విస్తరించి కనిపిస్తున్న రహదారుల వెడల్పులో భాగంగా స్థల సేకరణకు సంబంధించి అనేక సమస్యలు పరిష్కారం చూసేవారు. దీర్ఘకాలిక ప్రజాసమస్యల పరిష్కారం, అభివృద్ధిలో ఇతర శాఖలను భాగస్వామ్యం చేస్తూ ప్రతి నెలలో రెండు సార్లు కన్వర్జెన్సీ సమావేశాలు నిర్వహించేవారు. ఒకానొక దశలో సీఎం కేసీఆర్ ప్రభుత్వ హయాంలో పురపాలక శాఖ మంత్రి కేటీఆర్ ప్రజాప్రతినిధులు, అన్ని శాఖల అధికారులతో కలిసి సమన్వయ సమావేశం ఏర్పాటు చేసి.. తగిన సూచనలతో సమగ్రాభివృద్ధికి చర్యలు చేపట్టేవారు. కానీ గడిచిన కొన్ని నెలలుగా ప్రభుత్వ శాఖలతో జీహెచ్‌ఎంసీ సమన్వయం కుదరడం లేదు.

### అధికారుల మధ్య సమన్వయం లేక..

అధికారుల మధ్య సమన్వయం లేకపోవడంతో వేరే పనుల కోసం రోడ్లను తవ్వి అలాగే వదిలి వెళ్తున్నారు. కొన్ని చోట్ల అసలు అనుమతి లేకుండానే పనులు చేసుకుంటున్నారు. అదే సమన్వయ సమావేశాలు నిర్వహిస్తే అన్ని శాఖల అధికారులు ఉండటంతో అనుమతులు ఎవరిచ్చారో తెలుస్తుందని..దీని వల్ల పనులు పూర్తయ్యాక తిరిగి రోడ్లు వేసేలా చర్యలు తీసుకోవడానికి వీలుంటుందని అధికారులు చెబుతున్నారు. వైట్ టాపింగ్ రోడ్లు, ఎస్ఆర్‌డీపీ తదితర పనులు ప్రారంభించే ముందుగానే ఆయా మార్గాల సమాచారాన్ని ఎలక్ట్రిసిటీ, జలమండలి, పోలీస్ తదితర శాఖలకు అందిస్తే పైపులైన్లను మార్చడం, అండర్ కేబుల్ నెట్‌వర్క్స్, సీసీటీవీల ఏర్పాటు తదితర పనులను ముందే పూర్తి చేసే అవకాశం ఉంటుంది. అలా చేయకపోవడంతో రోడ్లు వేసిన కొద్ది రోజులకే ఏదో కారణంగా తవ్వేస్తున్నారు. దీని వల్ల ప్రజాధనం వృథా కావడంతో పాటు జనం ఇబ్బందులు పడుతున్నారు. వెంటనే ప్రభుత్వ శాఖల అధికారులతో సమన్వయ సమావేశం ఏర్పాటు చేసి సమస్యలను పరిష్కరించాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.



## నలుగురికి జీవనదానం

ఖైరతాబాద్: తాను మరణించినా.. నలుగురికి కొత్త జీవితాన్నిచ్చాడో వ్యక్తి. జీవన్‌దాన్ నోడల్ అధికారి ప్రొఫెసర్ భూషణ్ రాజు తెలిపిన వివరాల ప్రకారం.. ఏపీలోని గోపవరం గ్రామానికి చెందిన గోపిరెడ్డి రాజశేఖర్‌రెడ్డి ఈ నెల 1న బైక్ అదుపు తప్పి గాయపడ్డాడు. ఓ ప్రైవేట్ దవాఖానలో చేర్పించగా, చికిత్స అందిస్తున్న వైద్యులు ఈ నెల 12న బ్రెయిన్ డెడ్‌కు గురైనట్లు నిర్ధారించారు. కుటుంబసభ్యుల అంగీకారం మేరకు.. వైద్యులు రాజశేఖర్‌రెడ్డి శరీరం నుంచి కాలేయం, గుండె, రెండు మూత్రపిండాలను సేకరించినట్లు జీవన్‌దాన్ ప్రతినిధులు తెలిపారు.

# 258 అభ్యంతరాలు

### ఎలివేటెడ్ కారిడార్ ఏర్పాటుతో కోల్పోనున్న 348 నిర్మాణాలు

మేడ్చల్: రాజీవ్ రహదారిపై జేబీఎస్ నుంచి శామీర్‌పేట రింగురోడ్డు వరకు నిర్మించనున్న ఎలివేటెడ్ కారిడార్(ఫ్లై ఓవర్ బ్రిడ్జి)కి సంబంధించి భూ సేకరణపై అభ్యంతరాల గడువు ముగిసింది. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో జరిపిన భూ సేకరణపై 258 అభ్యంతరాలు వచ్చాయి. కారిడార్ నిర్మాణానికి అవసరమయ్యే ప్రస్తుత రోడ్డుకు ఇరు వైపులా మరో 50 ఫీట్ల చొప్పున సేకరించి వంద ఫీట్ల రోడ్డుగా విస్తరించాల్సి ఉంటుంది. దీంతో అధికారులు జరిపిన భూ సేకరణలో 348 నిర్మాణాలు, 1,12,050 గజాల స్థలం ప్రభుత్వ, ప్రైవేట్ వ్యక్తులకు చెందిన ఆస్తులు కోల్పోనున్నారు. ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణం వల్ల కోల్పోతున్న ఆస్తుల వివరాల జాబితాను హెచ్‌ఎండీఏ అధికారులకు సమర్పించారు. ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణం 18 కిలోమీటర్ల పొడవునా నిర్మించనున్నారు. 12 కిలోమీటర్లు మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా పరిధిలోకి రాగా, మరో 6 కిలోమీటర్లు హైదరాబాద్ జిల్లా పరిధిలోకి వస్తుంది. అయితే భూ సేకరణకు సంబంధించి ఆస్తులకు చెందిన వారి నుంచి 258 అభ్యంతరాలు వచ్చిన నేపథ్యంలో హెచ్‌ఎండీఏ అధికారులు ఎలాంటి చర్యలు చేపడుతారన్నది త్వరలో తేలిపోతుందని అధికారులు వెల్లడిస్తున్నారు. భూ సేకరణలో ఆస్తులు కోల్పోతున్న వారికి ప్రస్తుతం వారి వారి ప్రాంతంలో ఉన్న ప్రభుత్వ రిజిస్ట్రేషన్ ధరకు రెట్టింపు ధర నష్టపరిహారం అందించనున్నారు. త్వరలోనే ఫైనల్ డిక్లరేషన్‌ను విడుదల చేస్తామని అధికారులు చెబుతున్నారు. కాగా, జిల్లా పరిధిలో జరిపిన భూ సేకరణలో హెచ్‌ఎండీఏకు 258 ఫిర్యాదులు వచ్చాయి. ఈ ఫిర్యాదుల్లో అధిక మంది రోడ్డు విస్తరణను తగ్గించాలని, బైపాస్ రోడ్డువేసి తమ ఆస్తులను రక్షించాలని, ప్రస్తుతం ఉన్న రోడ్డుతోనే సరిపెట్టాలని సూచించనట్లు అధికారుల ద్వారా తెలిసింది. లోతుకుంట నుంచి హైదరాబాద్ జిల్లాలో భూ సేకరణ పనులు జరగాల్సి ఉంది.

### బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో..

జేబీఎస్ నుంచి శామీర్‌పేట రింగు రోడ్డు వరకు ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణాన్ని బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే ప్రతిపాదించారు. కారిడార్ నిర్మాణానికి సంబంధించి ఇంజినీరింగ్ అధికారులతో ప్లాన్ తయారు చేయించింది. అయితే కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణానికి అనుమతి లభించిన విషయం తెలిసిందే. సాంకేతిక సమస్యలను అధిగమించేలా కాంగ్రెస్ ప్రభుత్వం ఏ మేరకు ప్రయత్నిస్తుందో వేచి చూడాల్సిందే.




## గ్రేటర్ @27.7

సిటీబ్యూరో, జనవరి 13 (నమస్తే తెలంగాణ): ఆగ్నేయ దిశ నుంచి వీస్తున్న కిందిస్థాయి గాలుల ప్రభావంతో గ్రేటర్‌లో రాత్రి ఉష్ణోగ్రతలు స్వల్పంగా పెరిగాయి. కాని పగటి ఉష్ణోగ్రతలు మాత్రం సాధారణ స్థాయి కంటే తగ్గాయి. సోమవారం ఉదయం నుంచి రాత్రి వరకు నగరంలో గరిష్ఠ ఉష్ణోగ్రతలు సాధారణ స్థాయి కంటే 3.3డిగ్రీలు తగ్గి 27.7డిగ్రీల సెల్సియస్, కనిష్ఠ ఉష్ణోగ్రతలు 18.2డిగ్రీల సెల్సియస్, గాలిలో తేమ 43శాతంగా నమోదైనట్లు హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు వెల్లడించారు.

# ఏడాది గడిచినా.. మౌలిక వసతులేవీ?

### మెరుగైన సదుపాయాలపై దృష్టి పెట్టని ప్రభుత్వం

### ఇప్పటికీ పెండింగ్‌లోనే లింకు రోడ్లు, రేడియల్ రోడ్ల నిర్మాణం

సిటీబ్యూరో: కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి ఏడాది గడిచింది. హైదరాబాద్ నగర రియాల్టీకి కీలకమైన శివారు ప్రాంతాల అభివృద్ధిని మరిచింది. కనీసం ప్రతిపాదనలో ఉన్న ప్రాజెక్టులను కూడా పట్టాలెక్కించలేకపోయింది. బీఆర్ఎస్ హయాంలో నగరాభివృద్ధిని శివారు ప్రాంతాలకు విస్తరించేలా ప్రణాళికలను అమలు చేయగా, అందుకు భిన్నంగా ప్రస్తుత పాలన విధానాలు ఉండటంతో... మెరుగైన సదుపాయాలు ప్రజలకు ఇప్పటికీ అందుబాటులోకి రాలేదు.

### కుంటుపడిన అభివృద్ధి

గడిచిన ఏడాది కాలంగా ఓఆర్ఆర్ వెంబడి అభివృద్ధి కుంటుపడింది. ప్రతిపాదనల్లో ఉన్న రేడియల్, లింకు, అంతర్గత రోడ్ల నిర్మాణ పనులను చేపట్టలేదు. ఇక శివారు ప్రాంతాలకు మెరుగైన రవాణా వసతులు కల్పించేలా రూపొందించిన ప్రతిపాదనలను కూడా కార్యరూపంలోకి కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకురాలేదు. ఏడాది కిందట రెండు ఎలివేటెడ్ కారిడార్లకు శంకుస్థాపన చేసినా... ఇప్పటికీ ఆ ప్రాజెక్టు అవసరమైన భూముల సమీకరణ పూర్తి చేయలేదు. ఇక హెచ్‌ఎండీఏ పరిధిలో నిర్మించే లింకు రోడ్ల నిర్మాణ పనులన్నీ పెండింగ్‌లోనే పడగా... శివారు ప్రాంతాల్లో అభివృద్ధికి ఆటంకం ఏర్పడింది.



### ఎన్నో రోడ్లు నిర్మాణ దశలోనే..

కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తొలి నాళ్లలోనే హైదరాబాద్ నగరానికి గత కొన్నేళ్లుగా పెండింగ్‌లో ఉన్న ఎలివేటెడ్ కారిడార్ ప్రాజెక్టులకు గతేడాది శంకుస్థాపన చేసింది. దీనికి అవసరమైన భూములను సేకరించేందుకు రక్షణ శాఖ అంగీకరించినా... ఇప్పటి వరకు ఆ భూములకు పరిహారం ఇచ్చేందుకు అనువైన భూములను సేకరించలేకపోయింది. దీంతో ఎలివేటెడ్ ప్రాజెక్టుల భూసేకరణ, పరిహారం ఇప్పుడు సందిగ్ధంలో పడిన నేపథ్యంలో... రక్షణ శాఖకు ఇవ్వాల్సిన దాదాపు 800 ఎకరాల పరిహారం ఇప్పుడు హెచ్‌ఎండీఏకు తలనొప్పిగా మారింది. అదేవిధంగా అవుటర్ రింగు రోడ్డు లోపల ఉన్న ఎన్నో కాలనీలకు ఇప్పటికీ మెరుగైన రవాణా సదుపాయాలు లేక ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికీ బీఆర్ఎస్ ప్రభుత్వంలో ప్రారంభించిన ఎన్నో రోడ్లు నిర్మాణ దశలోనే ఉన్నాయి. ముఖ్యంగా బాచుపల్లి నుంచి మియాపూర్ వచ్చే మార్గంలో ఇంకా రోడ్డు నిర్మాణంలో ఉంది.

### మెరుగైన రవాణా ఇంకెప్పుడూ?

కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత రాయదుర్గం నుంచి శంషాబాద్ ఎయిర్‌పోర్టు మార్గాన్ని రద్దు చేయడంతో.. ఎప్పుడో పట్టాలెక్కాల్సిన ఈ ప్రాజెక్టు కూడా నిలిచిపోయింది. ఇక అలైన్ మెంట్ మార్పుతో కోర్ సిటీ నుంచి ఎయిర్‌పోర్టు వరకు మెట్రో నిర్మాణం మరింత జాప్యం కానున్నది. ప్రస్తుతం ఈ ప్రాజెక్టు ఇంకా డీపీఆర్ దశలోనే ఉండగా... కేంద్రం అనుమతులిచ్చినా... పనులు పూర్తి కావడానికి కనీసం ఎనిమిదేండ్లు పట్టనున్నది. అప్పటివరకు శంషాబాద్ లాంటి కీలకమైన ప్రాంతాలకు ఆర్టీసీ, ఇతర ప్రైవేటు రవాణా సౌకర్యాలను వినియోగించాల్సిన పరిస్థితి నెలకొంది.